తెలుగు దినపత్రిక

# సిద్దిపేట పవర్

ప్రతిక్షణం ప్రజల పక్షం



విలేకరులు కావలెను

తెలుగు రాష్ట్రాల నుండి విడుదలవుతున్న

సంచలన సమాచార దినపత్రిక 'సిద్దిపేట పవర్' తెలుగు దినపత్రికలో

పనిచేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్ లు ఆర్సీ ఇంచార్జ్ లు కావలెను

ఆసక్తి ఉన్నవారు వెంటనే సంప్రదించండి

ఫోన్ : 9866338848

www.siddipetpower.com



సోమవారం | 03-03-2025 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు | సంపుటి 01 | సంచిక 44 | వెల : 06 రూ


# ఎస్ఎల్బీసీ టన్నెల్

## సహాయక చర్యలను పరిశీలించిన సీఎం

- ఫిబ్రవరి 22న ఎస్ఎల్బీసీ టన్నెల్ వద్ద ప్రమాదం
- 8 మంది గల్లంతు.. ఇప్పటికీ తెలియరాని ఆచూకీ
- గత 9 రోజులుగా కొనసాగుతున్న సహాయక చర్యలు




నాగర్ కర్నూలు జిల్లా దోమలపెంట వద్ద ఎస్ఎల్బీసీ టన్నెల్ 14వ కిలోమీటరు వద్ద జరిగిన ప్రమాదంలో 8 మంది చిక్కుకుపోగా, నేటికి 9వ రోజు కూడా వారి ఆచూకీ తెలియరాలేదు. ఇవాళ సీఎం రేవంత్ రెడ్డి సంఘటన స్థలానికి వచ్చారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ లోకి వెళ్లి సహాయక చర్యలు కొనసాగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం టన్నెల్ వద్ద అధికారులతో సమావేశం అయ్యారు. సహాయక చర్యలపై సమీక్ష చేపట్టారు. గత 9 రోజులుగా సహాయక చర్యలు జరుగుతున్న తీరును అధికారులు, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, మృతదేహాలు బయటికి తీసుకువచ్చే వరకు పనులు ఆపొద్దని సూచించారు. రెస్క్యూ టీమ్ లకు అధికారులు అన్ని విధాలుగా సహకరించాలని నిర్దేశించారు. కాగా, ఎన్డీఆర్ఎఫ్, ఆర్మీ అధికారులు కూడా ఈ సమీక్షలో పాల్గొన్నారు.

# సారీ రాజన్న నా మీద కోపం..

## నీ మీద తీసిండ్రూ



సిరిసిల్ల రూరల్, మార్చి 2 : మీకే కాదు ఎవరికి అన్యాయం జరిగినా కాపాడుకుంటామని.. నామీద కోపంతో సిరిసిల్ల కలెక్టర్ నిన్ను అరెస్ట్ చేసి జైలుకు పంపిండు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ రైతు రాజిరెడ్డితో అన్నారు. ఈ మేరకు ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో ఇటీవల అక్రమ కేసుతో జైలుకు వెళ్లి వచ్చిన రైతు రాజిరెడ్డిని కేటీఆర్ పరామర్శించారు. ఈ సందర్భంగా రైతు రాజిరెడ్డితో మాట్లాడారు. కేసీఆర్ కూడా కక్ష సాధింపు రాజకీయాలు చేయాలి అనుకుంటే వీళ్ళు ఎవరైనా మిగిలే వాళ్ళు కాదు కదా అన్నారు. బాధపడకుర్రి.. భయపడకుర్రి. ఎవ్వలకేమైనా ఇదే రకంగా కాపాడుకుంటా.. అండగా ఉండి ఆదుకుంటానని భరోసానిచ్చారు కేటీఆర్. గరీబోళ్లకు కులం మతం ఉండదు.. నీకు నిజంగా అసైన్డ్ భూమి ఉంటే ఉండనీ.. ఎందుకు ఉండొద్దు. అసైన్డ్ భూమి అనేదే పేదలకు ఇచ్చేది కదా అని కేటీఆర్ పేర్కొన్నారు. 10 ఏళ్ల కేసీఆర్ పాలనలో మేము కక్షలు చేయలే.. మేమే కక్షపూరితంగా వ్యవహరిస్తే వాళ్ళు ఉండేవాళ్ళ? అని ఆగ్రహం వ్యక్తం చేశారు కేటీఆర్. కేసీఆర్ మన ప్రభుత్వ పాలనలో.. మన పని మనం చేసుకుంటూ.. ప్రజలకు అండగా ఉండమన్నారు. కాంగ్రెసోళ్లు వచ్చినా, బీజేపోళ్లు వచ్చినా వాళ్లకు లాభం చేసినం కానీ నష్టం చేయలేదని కేటీఆర్ తెలిపారు. ఒక పేదోడు బతుకుదెరువు కోసం టీ స్టాల్ పెట్టుకుంటే దాన్ని కూడా తీసేసిన దరిద్ర ప్రభుత్వం ఈ కాంగ్రెస్ ప్రభుత్వమని కేటీఆర్ మండిపడ్డారు. మళ్లా మంచి రోజులు వస్తాయనీ ఇప్పుడు, అప్పుడు మీకు అండగా నేనే ఉంటానని, ధైర్యంగా ఉండాలని సూచించారు. ఏ అవసరం ఉన్న చెప్పండి.. అండగా ఉంటానని భరోసానిచ్చారు. అంతకుముందు రాజిరెడ్డి కుటుంబ పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. కుటుంబసభ్యులకు సైతం ధైర్యం చెప్పారు.

## రెండున్నరేళ్లలో వరంగల్ ఎయిర్పోర్టు నిర్మిస్తాం: రామ్మోహన్



వరంగల్ మామునూర్ ఎయిర్ పోర్టును రెండున్నరేళ్లలో పూర్తి చేస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ భూసేకరణ చేస్తే ఎయిర్ పోర్టు పనులు వేగవంతం అవుతాయని, ఆ తర్వాత రెండున్నరేళ్లలో నిర్మిస్తామని చెప్పారు. అటు భద్రాద్రి ఎయిర్పోర్టు కోసం గతంలో ప్రతిపాదించిన స్థలం ఫీజిబులిటీగా లేదని, కొత్త స్థలంపై ఫీజిబులిటీని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని రామ్మోహన్ చెప్పారు.

## దేశంలోనే అతి పిన్న వయస్కురాలైన ఐఏఎస్ అధికారిణి



హర్యానాలోని మహేంద్రగఢ్ జిల్లాకు చెందిన దివ్య తన్వర్ చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయింది. డిగ్రీ పూర్తి చేసిన వెంటనే యూపీఎస్సీ సివిల్స్‌పై దృష్టి పెట్టింది. గురువుల ప్రోత్సాహంతో కోచింగ్ తీసుకుంది. 21 ఏళ్ళకి తన తొలి ప్రయత్నంలో 438వ ర్యాంకు సాధించి ఐపీస్ అయ్యింది. 22 ఏళ్లకి రెండోసారి ఆల్ ఇండియా 105వ ర్యాంకు కొట్టి ఐఏఎస్ అధికారిణి అయ్యింది. దేశంలోనే అతి పిన్న వయస్కురాలైన ఐఏఎస్ అధికారిణిగా అందరి దృష్టిని ఆకర్షించింది.

# స్మగ్లర్లు, దేశద్రోహులను

## హీరోలుగా చూపిస్తున్నారు: వెంకయ్యనాయుడు

- హైదరాబాదులో నటి, నిర్మాత కృష్ణవేణి సంస్మరణ సభ
- హాజరైన మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- హీరోల పాత్రలపై దర్శకులు తీరు మార్చుకోవాలని హితవు
- చెడ్డ పనులను ఎప్పుడూ గొప్పగా చూపించకూడదని సూచన




దేశంలో సినీ రంగం పోకడలపై మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. సినిమాల్లో హీరో పాత్రల తీరుపై దర్శకులు పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. ఒకప్పుడు సినిమాల ద్వారా ప్రజలకు మంచి సందేశం వెళ్లేదని. ఇప్పుడు స్మగ్లర్లు, దేశ ద్రోహులు, సమాజంలో తప్పుడు విధానాలు పాటించేవాళ్లతో హీరో పాత్రలకు రూపకల్పన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మంచి పద్ధతి కాదని, దీనివల్ల ఎలాంటి సందేశం వెళుతుందో దర్శకులు ఒకసారి ఆలోచించాలని అన్నారు. చెడ్డ పనులను ఎప్పుడూ గొప్పగా చూపించకూడదని, దీని ప్రభావం పిల్లలపై పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సినిమా రంగం బాధ్యతాయుతమైన మాధ్యమంగా ఉండాలని వెంకయ్యనాయుడు అభిలషించారు. ఇటీవల కన్నుమూసిన తెలుగు చిత్ర పరిశ్రమ తొలి తరం నటి, నిర్మాత కృష్ణవేణి సంస్మరణ సభ నేడు హైదరాబాదులో ఫిలింనగర్ కల్చరల్ క్లబ్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా వెంకయ్యనాయుడు ఈ వ్యాఖ్యలు చేశారు.

# రేవంత్ రెడ్డీ... నీకు చేతనైతే

## చంద్రబాబుపై యుద్ధం ప్రకటించు

- ఎస్ఎల్బీసీ టన్నెల్ ను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి
- ఆదరాబాదరాగా ఎస్ఎల్బీసీ పనులను పరుగెత్తించారన్న హరీశ్ రావు
- కార్మికులు వద్దన్నా వినకుండా వారిని మృత్యుకుహరంలోకి నెట్టారని ఆగ్రహం



సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం ఎస్ఎల్బీసీ టన్నెల్ వద్ద సహాయక చర్యలపరిశీలనకు వెళ్లడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఘాటుగా స్పందించారు. మీ రాజకీయ ప్రయోజనాల కోసం సాంకేతికపరమైన అంశాలు నిర్లక్ష్యం చేసి ఆదరాబాదరాగా ఎస్ఎల్బీసీ పనులను పరుగెత్తించారని విమర్శించారు. కార్మికులు వద్దని వారిస్తున్నా వినకుండా వారిని మృత్యుకుహరంలోకి నెట్టారని మండిపడ్డారు. కార్మికుల ప్రాణాలు బలితీసుకుని ఇప్పుడు కుహనా ఏడుపులు ఏడుస్తున్నారని ధ్వజమెత్తారు. నీకు నిజాయతీ ఉంటే ఎస్ఎల్బీసీ ప్రమాదంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి దోషులు ఎవరో తేల్చాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. పచ్చి అబద్ధాలు మాట్లాడడం, నోటికి వచ్చినట్టు కారుకూతలు కూయడం ఇక ఆపేయాలని... ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే పనులు జరగవని, ఒళ్లు వంచి పనిచేస్తేనే పనులు జరుగుతాయని తెలిపారు. 15 నెలలైనా నీకు జ్ఞానోదయం కాకపోవడం తెలంగాణ దౌర్భాగ్యం అని హరీశ్ రావు పేర్కొన్నారు. "కేసీఆర్ హయాంలో ప్రాజెక్టుల పనులు ఆగలేదు కాబట్టే రేవంత్ రెడ్డి అప్పుడేమీ మాట్లాడలేకపోయాడు. నిధులు ఖర్చు చేయకుండానే 11.48 కిలోమీటర్ల మేర టన్నెల్ పనులు జరిగాయా? 2014 నుంచి 2023 వరకు రూ.3,9ని ప్రజలకు కూడా అర్థమైంది. మేం పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రితో సత్సంబంధాలు కొనసాగించాం. అంతే తప్ప పక్క రాష్ట్ర సీఎం తరఫున సూట్ కేసులు మోయలేదు. ఏపీ సీఎం చంద్రబాబు రోజుకు 10 వేల క్యూసెక్కులు తరలించుకుపోతున్నాడు... ప్రశ్నిస్తున్న మాపై రంకెలు వేయడం కాదు.నీకు చేతనైతే చంద్రబాబుపై యుద్ధం ప్రకటించు. బీజేపీతో పగలు కుస్తీ... రాత్రి దోస్తీ. ఎస్ఎల్బీసీ టన్నెల్ సందర్శనకు వచ్చిన బీఆర్ఎస్ నేతలను ఎందుకు ఆపారు? బీజేపీ నేతలకు ఎలా స్వాగతం పలికారు?" అంటూ హరీశ్ రావు విమర్శనాస్త్రాలు సంధించారు.

# మామునూరు ఎయిర్ పోర్టు ఎలా ఉండాలో చెప్పిన సీఎం

- మామునూరు ఎయిర్ పోర్టు నిర్మాణంపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- కేరళలోని కొచ్చి విమానాశ్రయం తరహాలో ఉండాలని అధికారులకు సూచన
- భూసేకరణ ప్రక్రియ వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశం



కేరళలోని కొచ్చి విమానాశ్రయం తరహాలో వరంగల్ మామునూరు విమానాశ్రయం ఉండాలని, నిత్యం కార్యకలాపాలు కొనసాగేలా విమానాశ్రయాన్ని తీర్చిదిద్దాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కేంద్ర ప్రభుత్వం మామునూరు విమానాశ్రయ అభివృద్ధికి అనుమతి తెలిపిన నేపథ్యంలో నిన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. భూసేకరణ, పెండింగ్ పనుల వివరాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పనులకు సంబంధించి ప్రతి నెలా నివేదికను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, సీతక్క, ఎంపీలు కడియం కావ్య, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీహరి, ప్రకాశ్ రెడ్డి, నాగరాజు, మేయర్ సుధారాణి, సలహాదారు వేం సురేందర్ రెడ్డి, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

# అధైర్య పడొద్దు అండగా ఉంటా.. కేటీఆర్

## టీ స్టాల్ నిర్వాహకుడికి కేటీఆర్ భరోసా



సిరిసిల్ల టౌన్, మార్చి 2: అధైర్య పడొద్దు అండగా ఉంటానని టీ స్టాల్ నిర్వాహకుడికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసానిచ్చారు. ఆదివారం సిరిసిల్ల క్యాంప్ కార్యాలయంలో కేటీఆర్ టీ స్టాల్ నిర్వాహకుడు బత్తుల శ్రీనివాస్ కుటుంబ సభ్యులు కేటీఆర్‌ను కలిశారు. నేను ఎవరికీ ఏ అన్యాయం చేయలేదు సార్ అని విలపించాడు. నా పని ఏందో నేను చేసుకొని బతుకుతుంటే కలెక్టర్ వచ్చి బతుకమ్మ ఘాట్ వద్ద ఉన్న మా టీ స్టాల్‌లో మీ ఫొటోను చూసి నా హోటల్ మూయించాడని కేటీఆర్‌తో గోడు వెళ్లబోసుకున్నారు. రెండు రోజుల తర్వాత వచ్చి సామానుతో సహా హోటల్ డబ్బానే అధికారులు ఎత్తుకెళ్లారని వాపోయారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ అధైర్య పడొద్దు. నేను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. రూ.10 లక్షలు ఖర్చయినా సరే శాశ్వత ఉపాధి చూపిస్తా.. మంచి టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేసుకో వారం, పది రోజుల్లో వచ్చి నేనే ప్రారంభిస్తా అని చెప్పారు. అద్దె భారం లేకుండా ప్రత్యామ్నాయ మార్గం నేనే చూపిస్తా అని కేటీఆర్ హామీనిచ్చారు.

# ఇది ఒక విపత్తు...


## అందరం సానుభూతి ప్రకటించాల్సిన సమయం: సీఎం

- ఎస్ఎల్బీసీ వద్ద ప్రమాదం... 8 మంది గల్లంతు
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- ఆదివారం టన్నెల్ ను సందర్శించిన సీఎం



ఎస్ఎల్బీసీ టన్నెల్ వద్ద కొనసాగుతున్న సహాయక చర్యలను పరిశీలించిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది ఒక విపత్తు.అందరం కలిసి సానుభూతి ప్రకటించాల్సిన సమయం అని పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో చిక్కుకుపోయిన 8 మంది కుటుంబాలను ఆదుకుంటామని ప్రకటించారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావులను హెలికాప్టర్ లో హుటాహుటీన అక్కడికి పంపానని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ప్రతి నిమిషం సమీక్షిస్తూనే ఉన్నానని, ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుంటున్నానని తెలిపారు. సహాయక చర్యల్లో 11 కేంద్ర, రాష్ట్ర సంస్థలు పాలుపంచుకుంటున్నాయని వివరించారు. కాగా, గతంలో దేవాదుల వద్ద ప్రమాదం జరిగితే తొమ్మిదేళ్లయినా ఆ ఐదుగురి మృతదేహాలు లభ్యం కాలేదని రేవంత్ రెడ్డి వివరించారు. "ఎస్ఎల్బీసీ వద్ద ప్రమాదం జరిగితే ముఖ్యమంత్రి ఇప్పటివరకు ఎందుకు రాలేదని ప్రశ్నిస్తున్నారు. మరి హరీశ్ రావు దుబాయ్ వెళ్లి రెండ్రోజులు ఎంజాయ్ చేయలేదా? హరీశ్ రావు ప్రయాణ వివరాలు తీయండి. దుబాయ్ వెళ్లాడో, లేదో తెలుస్తుంది" అని అన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీష్ రావు బహిరంగ లేఖ



సిద్ధిపేట పవర్ దినపత్రిక: బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నూనె గింజల ఉత్పత్తిని పెంచడానికి రైతులను చైతన్యవంతులుగా తీర్చిదిద్దడం జరిగింది. సమయానికి రైతుబంధు తో పాటు సబ్సిడీలు అందజేసి నూనె గింజల పంటలను సాగు చేసేలా ప్రోత్సాహం కల్పించాము. సాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నాము. నాటి ప్రణాళికా బద్ధంగా నేడు తెలంగాణ రాష్ట్రంలో పెద్ద ఎత్తున నూనె పంటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం



పొద్దుతిరుగుడు(సన్ ఫ్లవర్) పంట కోతకు వచ్చింది. సన్ ఫ్లవర్ గింజలను విక్రయించడానికి ఇప్పటిదాకా రాష్ట్రంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా ఉంది. దీనివల్ల రైతులు రూ. 5,500 నుండి రూ. 6000 వరకు దళారులకు క్వింటాల్ చొప్పున విక్రయిస్తున్న పరిస్థితి దాపురించింది. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాఫెడ్ ద్వారా సన్ ఫ్లవర్ నూనె గింజలకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేశాము. ఈసారి కూడా రూ. 7280 మద్దతు ధరను నాఫెడ్ ప్రకటించింది. కానీ ఇప్పటిదాకా కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దళారులకు విక్రయించడం వల్ల క్వింటాల్ కు రూ. 1000 నుండి రూ. 2000 వరకు నష్టాన్ని చవిచూడాల్సిన దుస్థితి రైతులకు కలిగింది. వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా సన్ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతుల పక్షాన నేను డిమాండ్ చేస్తున్నాను. మీ అలసత్వం కారణంగా తెలంగాణ వ్యవసాయం తిరో గమన దిశలో పయనిస్తున్నది. నూనె పంటలు వేయాలంటేనే రైతులు ఆందోళన చెందే పరిస్థితులను మీరు కల్పిస్తున్నారు. ఇప్పటికైనా కళ్ళు తెరవండి.. క్షేత్రస్థాయిలో సన్ఫ్లవర్ గింజలు పండించిన రైతుల కష్టాలను తొంగి చూడండి. రేపటి నుండే రాష్ట్రమంతటా సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేలా ఆదేశించండి. ఎన్నికల కోడ్ తో రైతుల కష్టాలకు ముడి పెట్టకుండా ఒక ముఖ్యమంత్రిగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రజా ప్రభుత్వంలోనే కళలకు అధిక ప్రోత్సాహం



హైదరాబాద్ కళలను ప్రజా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని అన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దశాబ్ద కాలంగా గత ప్రభుత్వం కళాకారులకు నంది అవార్డులు ఇవ్వలేదని గుర్తుచేశారు. ప్రజా ప్రభుత్వం రాగానే సినిమా కళాకారులను ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నేడు నిర్వహించిన భక్త రామదాసు జయంతి వేడుకలలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ,ఈ క్రమంలోనే నంది అవార్డులకు గద్దర్ పేరు



పెట్టామని.. ఈ వార్డులను ఉగాది పండుగ నుంచి ఇవ్వబోతున్నట్లు స్పష్టం చేశారు.నాటక పోటీలను నిర్వహించి కళాకారులకు అవార్డులు ఇవ్వనున్నట్లు చెప్పారు.సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల మాట్లాడుతూ , తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతున్నట్లుగానే ఆధ్యాత్మికంగా కూడా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని అన్నారు. సీఎం సూచనల మేరకు భక్త రామదాసు 392వ జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు ఈ భక్త రామదాసు జయంతి ఉత్సవాల కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 26 సంగీత గాన బృందాలు తమ పేర్లను నమోదు చేసుకోవడంతో పాటు 600 మందికి పైగా సంగీత కళాకారులు పాల్గొన్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క తదితరులు పాల్గొన్నారు.

# రూ. 550 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన రేవంత్ రెడ్డి



వనపర్తి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో రూ.550 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రం,మండలాల్లో రూ. 40 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణ పనులకు, నూతన ప్రభుత్వ ఆసుపత్రి భావన నిర్మాణానికి రూ.203.95 కోట్లతో,నూతన ఐటీ టవర్ భవన నిర్మాణానికి 22 కోట్లు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణాలకు రూ. 47.50 కోట్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి రూ.200 కోట్లు, 30 పడకల ఆస్పత్రి భావనము (పెబ్బేర్) నిర్మాణపు పనులకు రూ. 11.20 కోట్లు, శ్రీరంగాపూర్ ఆలయానికి పర్యాటకంగా అభివృద్ధి పరిచేందుకు 1.5 కోట్లు, వనపర్తి నియోజకవర్గంలో గిరిజన ఆవాసాల అభివృద్ధి పనులకు రూ. 22.67 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న పనులకు ముఖ్య మంత్రి శంకుస్థాపనలు చేశారు. దీనితోపాటు కాసిం నగర్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం సమగ్ర సర్వే పనులకు కూడా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు మల్లు రవి, జిల్లా ఇన్చార్జి మరియు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎక్సైజ్ మరియు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు,వనపర్తి శాసన సభ్యులు తుడి మేఘారెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జిల్లెల చిన్నారెడ్డి, చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి, వివిధ శాఖల రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు,జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తదితరులు పాల్గొన్నారు.